# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతీయ ప్రత్యేకత అయిన భిన్నత్వంలో ఏకత్వం మహాకుంభ మేళాలో ప్రతిభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ వ్యోమగాములను తీసుకువస్తున్న అంతరిక్ష నౌక రేపు తెల్లవారు జామున 3:27 గంటలకు భూమిపైకి చేరుకుంటుందని నాసా వెల్లడించింది.
- ❖ భారత రైల్వేలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీన ప్రసారమవుతుంది.

========================

భారతీయ ప్రత్యేకత అయిన భిన్నత్వంలో ఏకత్వం మహాకుంభ మేళాలో ప్రతిభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈ రోజు లోక్‌సభలో ఆయన ప్రసంగించారు. కుంభమేళాలో భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచం మొత్తం చూసిందన్నారు. కోట్లాది మంది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించడం లో సరికొత్త ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసిందని పేర్కొన్నారు. ఈ విజయంపై దేశ ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

(వాయిస్ 34 సెకన్లు)

అదేవిధంగా నీటి సంరక్షణ ప్రాముఖ్యతను ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ... భారతదేశంలో అనేక నదులు ఉన్నాయని, వాటిలో కొన్ని అంతరించిపోతున్నాయని అన్నారు. మహా కుంభమేళా నుండి ప్రేరణ పొంది నదీ ఉత్సవాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు నీటి సంరక్షణ ప్రాముఖ్యతను ఇటువంటి కార్యక్రమాలు తెలియజేస్తాయని నరేంద్రమోదీ చెప్పారు.

=======================

సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకువచ్చే డ్రాగన్ అంతరిక్ష నౌక తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈరోజు ఉదయం 10 గంటల 35 నిమిషాలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి తిరుగు పయనమైన ఈ అంతరిక్ష నౌక 17 గంటల పాటూ ప్రయాణించి రేపు తెల్లవారుజామున 3 గంటల 27 నిమిషాలకు భూమి పైకి చేరుకుంటుందని నాసా వెల్లడించింది. ఇదిలా ఉండగా 9 నెలల నిరీక్షణ అనంతరం భూమిపైకి చేరుకోనున్న సునీతా విలియమ్స్ రాక కోసం భారత్‌లో ఎదురుచూస్తున్నామని ప్రధాననమంత్రి నరేంద్ర మోదీ ఆమెకు లేఖ రాశారు. సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని నరేంద్రమోదీ ఆకాంక్షించారు. సునీతా విలియమ్స్ సాధించిన విజయాల పట్ల 140 కోట్ల మంది భారతీయులు గర్వంగా ఉన్నారని ప్రధానమంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు.

=======================

భారతీయ రైల్వేలను మరింత మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ పని తీరుపై లోక్‌సభలో ఈరోజు జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ... 2020 నుండి దేశంలో ప్రయాణీకుల ఛార్జీలు పెంచలేదని, ఇతర దేశాలతో పోలిస్తే భారత్ లో తక్కువ ఛార్జీలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలో రైలు ప్రమాదాలను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైల్వే ప్రయాణీకుల భద్రతపై దృష్టి సారించామన్నారు. అదేవిధంగా జనరల్ కోచ్ ల సంఖ్య తగ్గించలేదని మంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

=======================

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈరోజు ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఇటీవల జరిగిన నాగ్ పూర్ అల్లర్లపై స్పందించారు. రాష్ట్ర ప్రజలందరూ శాంతిభద్రతలను కాపాడాలని అన్ని మతాల విశ్వాసాల పట్ల గౌరవంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నాగ్‌పూర్‌లో జరిగిన హింస ముందస్తు ప్రణాళికతో జరిగినట్లు కనిపిస్తోందని పోలీసు సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి ఎవరినీ అనుమతించబోమని దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వ వైఖరిని పునరుద్ఘాటించారు.

విరామం

=======================

భారతదేశం వైద్య పర్యాటక కేంద్రంగా మారనుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశం ప్రిసేటల్, నేటల్ సంరక్షణలో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అనంతరం న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ మాట్లాడుతూ... భారత్ లో సంస్థాగత ప్రసవాలు పెరగాయని, అలాగే వృద్ధులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణను అందిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు.

=======================

భారతదేశం యొక్క గృహ రుణాలు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే చాలా తక్కువ అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారత్ లో గృహ రుణాల శాతం 39గా ఉందని ఆమె వెల్లడిస్తూ...

(వాయిస్ 44 సెకన్లు)

ఇదిలా ఉండగా మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మణిపూర్ పరిస్థితిని ప్రభుత్వం సున్నితమైన అంశంగా పరిగణిస్తోందని ఇతర రాష్ట్రాల్లాగే మణిపూర్ కూడా అభివృద్ధి చెందాలని కోరుకుంటోందన్నారు. మణిపూర్‌కు సంబంధించిన ఓట్ ఆన్ ఎకౌంట్ బిల్లునుఈ రోజు ఆమె పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన ద్వారా 2025 మార్చి 7 వరకు 55 కోట్ల ఖాతాలు తెరవబడ్డాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వాటిలో 36.63 కోట్ల ఖాతాలు గ్రామీణ, చిన్న పట్టణాల ప్రాంతాలలోనే ఉన్నాయని వెల్లడించారు. ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానంగా ఇస్తూ... బ్యాంకింగ్ సేవలను అందరికీ అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో 2014లో ఈ పథకానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడానికి దీంతో పాటూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి ముద్ర యోజన, అటల్ పెన్షన్ యోజన, స్టాండ్ అప్ ఇండియా, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ముద్ర యోజన వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,170 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 1,131 పాయింట్లతో 75,301 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 325 పాయింట్ల లాభంతో 22,834 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 బలపడి 86.54గా ఉంది. అతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.11 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3,034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

========================

ఇటలీలోని టురిన్‌లో జరిగిన ప్రత్యేక ఒలింపిక్స్ వరల్డ్ వింటర్ గేమ్స్ 2025లో భారత అథ్లెట్ల అత్యుత్తమ ప్రదర్శనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. భారత బృందం 33 పతకాలను సాధించిపెట్టి, ప్రపంచ వేదికపై దేశాన్ని గర్వపడేలా చేసిందని తెలిపారు.

========================
========================